భూదాన్ భూముల కబ్జాయత్నం

● కూకట్‌పల్లిలో విలువైన ప్రభుత్వ భూమి ఆక్రమణకు యత్నం ● అడ్డుకొన్న అధికారులు.. కబ్జాదారులపై కేసు


కూకట్‌పల్లి ఏవీబీపురం ఆనుకొని ఉన్న భూదాన్ భూమి

కూకట్‌పల్లి, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): కూకట్‌పల్లిలోని కోట్ల రూపాయల విలువైన భూదాన్ భూమిపై కబ్జాదారులు కన్నేశారు. ప్రభుత్వ ఆధీనంలో ఉన్న భూమిలో ప్లాట్స్ చేసి విక్రయించేందుకు రంగంలోకి దిగారు. సమాచారం అందుకొన్న అధికారులు ఆక్రమణలను అడ్డుకొన్నారు. ఇదంతా కూకట్‌పల్లి ఏవీబీపురానికి ఆనుకొని ఉన్న భూదాన్ భూమిలో కొంతకాలంగా కొనసాగుతున్న వ్యవహారం. వివరాల్లోకి వెళితే.. కూకట్‌పల్లి మండలం పరిధిలోని 353, 354 సర్వే నెంబర్లలో సుమారు 24 ఎకరాల భూదాన్ భూమి ఉంది. గతంలో ఇక్కడి భూదాన్ భూమిలోని 7 ఎకరాల్లో పేదలకు పట్టాలు ఇచ్చారు. ఇంకో 17 ఎకరాల భూదాన్ భూమి ప్రభుత్వ ఆధీనంలో ఉంది. సదరు భూమిని స్థానిక రెవెన్యూ అధికారులు కాపాడుకొంటూ వస్తున్నారు.


ప్రైవేటు వ్యక్తులు సర్వే చేస్తూ మార్కింగ్ చేస్తున్న దృశ్యం

కబ్జాకు బీజం పడిందిలా..

గత బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో ఖాళీగా ఉన్న భూదాన్ భూమిపై కబ్జాదారుల కన్ను పడింది. రెండేళ్ల క్రితం రాజేందర్‌రెడ్డి అనే వ్యక్తి కూకట్‌పల్లిలోని భూదాన్ భూమికి సంబంధించి నకిలీ పట్టాలు సృష్టించి విక్రయించే ప్రయత్నం చేశాడు. సమాచారం అందుకొన్న అప్పటి తహసీల్దార్ ఆక్రమణలను అడ్డుకోవడంతో పాటు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇదిలా ఉంటే తాజాగా ఈనెల 22న కబ్జాదారుడు రాజేందర్‌రెడ్డితో పాటు మరో పది మంది భూదాన్‌భూమిని ఆక్రమించి ప్లాట్స్ చేసే ప్రయత్నం చేశారు. ప్రైవేటు సర్వే ద్వారా ప్లాట్స్‌గా విభజించి మార్కింగ్ వేసేందుకు యత్నించారు. విషయం తెలుసుకొన్న స్థానికులు జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. కలెక్టర్ ఆదేశాల మేరకు రంగంలోకి దిగిన రెవెన్యూ అధికారులు సర్వేను అడ్డుకోవడంతో పాటు ప్లాట్స్ నెంబర్స్ రాళ్లను తొలగించారు. కబ్జాదారులు అడ్డుకొనే ప్రయత్నం చేయడంతో పోలీసులు రంగప్రవేశం చేశారు. కబ్జాకు యత్నించిన రాజేందర్‌రెడ్డితో పాటు మరో 10 మందిపై తహసీల్దార్ స్వామి కూకట్‌పల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకొన్న పోలీసులు భూమి కబ్జా వ్యవహారంలో ఎవరి పాత్ర ఉందనే కోణంలో దర్యాప్తు చేస్తున్నారు.

ప్రభుత్వ భూమిని కాపాడుతాం

కూకట్‌పల్లి ఏవీబీపురం ఆనుకొని ఉన్న 353, 354 సర్వేనెంబర్లలో సుమారు 17 ఎకరాల ప్రభుత్వ స్థలం ఉంది. దానిపై కొందరు కబ్జాదారులు తప్పుడు పట్టాలు సృష్టించి అమాయకులకు విక్రయించేందుకు ప్రయత్నిస్తున్నట్లు మా దృష్టికి వచ్చింది. రెండేళ్ల క్రితం ఇదే తరహాలో భూమిని ఆక్రమించేందుకు ప్రయత్నించిన వ్యక్తులపై పోలీసులకు ఫిర్యాదు చేయడంతో పాటు భూమి ఆక్రమణకు గురికాకుండా కాపాడగలిగాం. తాజాగా గతంలో కబ్జాకు యత్నించిన వారే మరోసారి రావడంతో అడ్డుకట్ట వేయడంతోపాటు పోలీసులకు ఫిర్యాదు చేశాం. ప్రభుత్వ ఆధీనంలో ఉన్న భూదాన్ భూమి కబ్జా కాకుండా కాపాడుకొంటాం.

- స్వామి, తహసీల్దార్ కూకట్‌పల్లి మండలం

ఉచిత వైద్యశిబిరానికి స్పందన


వైద్య పరీక్షలు చేయించుకొంటున్న కాలనీవాసులు

కూకట్‌పల్లి, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): విజయనగర్ కాలనీలోని విజయ సీనియర్ సిటిజన్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు ఆమోర్ ఆసుపత్రి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానికులకు వైద్య పరీక్షలతో పాటు ఈసీజీ, సాధారణ వైద్య పరీక్షలు చేశారు. స్థానికులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని అసోసియేషన్ ప్రతినిధులు పడిగేశ్వరరావు, రామచంద్రరావు, వెంకటేశ్వరరావు తదితరులు తెలిపారు.


కేఎం ప్రతాప్‌ను కలిసి వినతిపత్రం అందజేసిన కాలనీవాసులు

రహదారి సమస్యను పరిష్కరించాలి

పేట్‌బషీరాబాద్, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): కుత్బుల్లాపూర్ డివిజన్ పరిధి ముద్దాపురంకాలనీ, హెచ్ఎంటీ ప్రభుత్వ స్థలానికి మధ్య వివాదాస్పదంగా ఉన్న రహదారి సమస్యను పరిష్కరించాలని రంగారెడ్డి జిల్లా మాజీ డీసీసీ అధ్యక్షుడు కేఎం ప్రతాప్‌ను కాలనీవాసులు ఆదివారం కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. తమ కాలనీ నుంచి కుత్బుల్లాపూర్ ప్రధాన రహదారి వరకు రోడ్డు నిర్మాణం చేపట్టేలా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. సంబంధిత అధికారులతో చర్చించి రహదారి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని కాలనీవాసులకు ఆయన హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ముద్దాపురం కాలనీ సంక్షేమ అధ్యక్షుడు జంగయ్య, కమిటీ సభ్యులు కృష్ణారెడ్డి, వెంకటేష్, ప్రతాప్, ధనంజయుడు, శ్రీరామ్, శ్రీహరి, సుధాకర్, హేమంత్, రాకేష్, శివ, మహిళలు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న కొలన్ హన్మంత్‌రెడ్డి

రేపు ఎన్నికల సన్నాహక సమావేశం

నిజాంపేట్, మార్చి 24(ఆంధ్రజ్యోతి): ఈనెల 26న బాచుపల్లి కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో కుత్బుల్లాపూర్ నియోజకవర్గ పార్లమెంట్ ఎన్నికల సన్నాహక సమావేశం నిర్వహిస్తున్నట్టు నియోజకవర్గ ఇన్‌చార్జి కొలన్ హన్మంత్‌రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి పార్టీ ఇన్‌చార్జి మంత్రి తుమ్మల నాగేశ్వరరావు హాజరుకానున్నట్లు తెలిపారు. నియోజకవర్గ ముఖ్య నాయకులతో పాటు మల్కాజ్‌గిరి కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి సునీతామహేందర్‌రెడ్డితో మంత్రి సమావేశం అవుతారని తెలిపారు. ఆ సమావేశానికి కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో హాజరయ్యేలా చూడాల్సిన బాధ్యత మనందరిపైనా ఉందని హన్మంత్‌రెడ్డి సూచించారు. ఈ సమావేశంలో నిజాంపేట్, దుండిగల్, కొంపల్లి, కుత్బుల్లాపూర్ ప్రాంతాలకు చెందిన పార్టీ నాయకులు, కార్యకర్తలు, ఎన్ఎస్‌యూఐ యూత్ నాయకులు, ఐఎన్‌టీయూసీ నాయకులు పాల్గొన్నారు.

క్షయ లక్షణాలు కనిపిస్తే అశ్రద్ధ చేయొద్దు


సంధ్యారాణి

బాలానగర్, మార్చి 24(ఆంధ్రజ్యోతి): క్షయ లక్షణాలు కనిపిస్తే ఏమాత్రం అశ్రద్ధ చేయకుండా నిర్ధారణ పరీక్షలు చేయించుకోవాలని మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా టీబీ ప్రోగ్రాం ఆఫీసర్ డా. బి సంధ్యారాణి సూచించారు. ఆదివారం అంతర్జాతీయ క్షయవ్యాధి నివారణ దినోత్సవం సందర్భంగా క్షయ రోగులకు పలు సూచనలు చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. రెండు వారాలకు మించి ఎడతెరపి లేని దగ్గు, తెమడతో రక్తం పడడం, రాత్రి పూట జ్వరం రావడం, బాగా చెమట పట్టటడం, ఆకలి మందగించడం, బరువు తగ్గడం చాతినొప్పలాంటి లాంటివి క్షయ లక్షణాలని తెలిపారు. 2023 జనవరి నుంచి డిసెంబర్ వరకు మేడ్చల్‌లో 4,500 కేసులు నమోదయ్యాయని, ప్రస్తుతం వారు చికిత్స పొందుతున్నారని స్పష్టం చేశారు.


హఫీజ్‌పేటలో కవాతు నిర్వహిస్తున్న పోలీసులు

హఫీజ్‌పేటలో పోలీసుల కవాతు

మియాపూర్, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): ఓటు హక్కుపై అవగాహన కల్పిస్తూ ఓటు స్వేచ్ఛగా వినియోగించుకునేలా ఓటర్లలో ధైర్యం నింపుతూ హఫీజ్‌పేట్‌లో పోలీసులు ఆదివారం కవాతు నిర్వహించారు. పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో హఫీజ్‌పేటలో మాదాపూర్ జోన్ డీసీపీ వినీత్ ఆధ్వర్యంలో పోలీసులు బస్తీలు, కాలనీల్లో పర్యటించారు. కార్యక్రమంలో మియాపూర్, చందానగర్ పోలీస్ స్టేషన్‌ల ఇన్‌స్పెక్టర్లు, సిబ్బంది పాల్గొన్నారు.


పూజల్లో ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ

కన్యకాపరమేశ్వరి ఆలయ వార్షికోత్సవం

చందానగర్, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): హఫీజ్‌పేట డివిజన్ హుడాకాలనీలో వాసవీ కన్యకాపరమేశ్వరి లలితా నగరేశ్వర ఆలయం ప్రథమ వార్షికోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ ముఖ్యఅతిథిగా హాజరై ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు గౌతమ్‌గౌడ్, వాలా హరీష్‌రావు, మల్లారెడ్డి, బాబుమోహన్, మల్లేష్, కంది జ్ఞానేశ్వర్, గోపి, కోటేశ్వరరావు, ఫౌండర్ చైర్మన్ వీరబొమ్మ శ్రీనివాస్, అధ్యక్షుడు బాదం సాయిబాబు, ఉపాధ్యక్షుడు కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

● చందానగర్ గంగారంలోని మల్లికార్జునస్వామి ఆలయంలో ఆదివారం మల్లన్నస్వామి కల్యాణంలో ఎమ్మెల్యే గాంధీ పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, స్థానికులు పాల్గొన్నారు.

● హోలీ శుభాకాంక్షలు

మియాపూర్: శేరిలింగంపల్లి నియోజకవర్గ ప్రజలకు, కార్యకర్తలకు ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ హోలీ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ప్రకృతి అనేక రంగులతో సింగారించుకునే సమయం, అదే వసంతోత్సవం, హోలీ పర్వదినం అన్నారు.


అల్లాపూర్ కాంగ్రెస్ సమావేశంలో నాయకులు, కార్యకర్తలు

అక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు

అల్లాపూర్, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం పేరు చెప్పుకుని కొంత మంది అక్రమార్కులు అల్లాపూర్ డివిజన్‌లో వసూళ్లకు పాల్పడుతూ ప్రజలను వేధిస్తున్నారని తమకు తెలిసిందని, అలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని పార్టీ డివిజన్ అధ్యక్షుడు మహ్మద్ మొయినుద్దీన్ హెచ్చరించారు. ఆదివారం గాయత్రినగర్‌లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. డివిజన్ పరిధిలో అక్రమ వసూళ్లు, కబ్జాలకు పాల్పడి పార్టీని అప్రతిష్ఠ పాల్జేస్తే ఉపేక్షించబోమని తెలిపారు. పార్టీ బీ-బ్లాక్ అధ్యక్షుడు తూము వేణు మాట్లాడుతూ.. కాముని చెరువు, సున్నం చెరువు పరిసరాల్లో కొందరు అక్రమంగా నీటిని తోడేస్తున్నారని, కిలోమీటరు వరకు పైపులు వేసి కామునిచెరువును ఖాళీ చేసేస్తున్నారని ఆరోపించారు. అధికారులకు ఫిర్యాదు చేయగా తూతూమంత్రంగా పైపులు కట్ చేసి చేతులు దులిపేసుకుంటున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో వాజిద్ పాషా, పల్లపు వేణు, హమీద్, విఠల్, ఆదిరెడ్డి, కరీం, నెల్లి శ్రీనివాస్ పాల్గొన్నారు.

వ్యక్తిపై హత్యాయత్నం


సర్వర్ ముఖం, చేయిపై గాయాలు

జీడిమెట్ల, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): జీడిమెట్ల పోలీస్‌స్టేషన్ పరిధిలోని వివేకానందనగర్‌లో శనివారం రాత్రి ఓ వ్యక్తిపై గుర్తు తెలియని వ్యక్తి కత్తితో దాడి చేశారు. కత్తిపోట్లకు గురైన వ్యక్తిని కుటుంబసభ్యులు ఆసుపత్రికి తరలించి చికిత్స చేయిస్తున్నారు. గాజులరామారం రోడ్డులోని వివేకానందనగర్‌కు చెందిన షేక్‌సర్వర్(48), శనివారం రాత్రి 10.30 గంటల సమయంలో రామారం నుంచి ఇంటికి నడుచుకుంటూ వస్తున్నాడు. అదే సమయంలో వివేకానంద విగ్రహం వద్దకు రాగానే వెనుక నుంచి గుర్తు తెలియని వ్యక్తి సర్వర్‌పై దాడిచేసి చేయిపైన, ముఖంపైన పొడిచాడు. స్థానికులు అప్రమత్తం కావడంతో దాడి చేసిన వ్యక్తి పారిపోయాడు. వెంటనే అక్కడికి చేరుకున్న కుటుంబసభ్యులు తీవ్ర గాయాలైన సర్వర్‌ను చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. జీడిమెట్ల పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

గాయపడిన వృద్ధుడి మృతి

పేట్‌బషీరాబాద్, మార్చి 24(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వృద్ధుడు(65) ఆదివారం మృతి చెందాడు. ఎస్ఐ రాంనారాయణ తెలిపిన వివరాల ప్రకారం.. ఈనెల 18న గుర్తు తెలియని వృద్ధుడు కొంపల్లి బ్రిడ్జ్ సమీపంలో రోడ్డు దాటుతుండగా మేడ్చల్ నుంచి సుచిత్రా వైపు వస్తున్న ద్విచక్ర వాహనం ఢీకొంది. దీంతో ఆ వృద్ధుడు తీవ్రంగా గాయపడ్డాడు. విషయం గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు చికిత్స నిమిత్తం 108లో గాంధీ ఆస్పత్రికి తరలించారు. అప్పటి నుంచి చికిత్స పొందుతున్న వృద్ధుడి పరిస్థితి విషమించడంతో ఆదివారం మృతి చెందినట్లు గాంధీ వైద్యులు పోలీసులకు సమాచారం అందించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. మృతిడి ఒంటిపై నీలిరంగు చొక్కా, బ్లూ రంగు లుంగీ ఉందని పోలీసులు తెలిపారు.

వ్యక్తి ఆత్మహత్య



పేట్‌బషీరాబాద్, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): ఆర్థిక ఇబ్బందులు తాళలేక వ్యక్తి ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్ఐ సురేందర్‌రెడ్డి తెలిపిన వివరాలు ప్రకారం.. ఆంధ్రప్రదేశ్‌కు చెందిన రవికుమార్(35) కుటుంబసభ్యులతో బతుకుదెరువు కోసం ఆరు నెలల క్రితం వలస వచ్చి కుత్బుల్లాపూర్ రాఘవేంద్రకాలనీలో నివాసం ఉంటున్నాడు. డ్రైవర్‌గా పని చేస్తూ జీవనోపాధి పొందుతున్నాడు. ఇటీవల డ్రైవింగ్ మానేసి ఇంటి వద్దనే ఉండడంతో ఆర్థిక ఇబ్బందులు తలెత్తాయి. దీనికి తోడు తల్లిదండ్రుల మరణించడంతో మనస్తాపానికి గురైన రవికుమార్ ఆదివారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు పేట్‌బషీరాబాద్ పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

డైమండ్‌హిల్స్ డెవలప్‌మెంట్ సొసైటీ సమావేశం


సమావేశంలో పాల్గొన్న సొసైటీ ప్రతినిధులు

రాయదుర్గం, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): గచ్చిబౌలిలోని డైమండ్ హిల్స్ డెవలప్‌మెంట్ సొసైటీ సభ్యులు ఆదివారం సమావేశాన్ని సొసైటీ అధ్యక్షుడు ఉపేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. తమ ప్లాట్లకు డబుల్ రిజిస్ట్రేషన్లు చేసినందుకు బాధ్యులందరిపై క్రిమినల్ కేసులు పెడతామని సభ్యులందరూ ఏకగ్రీవ తీర్మానం చేశారు. పాత పత్రాలను తిరస్కరించకుండా బుల్ రిజిస్ట్రేషన్ చెల్లదని, దాని ఆధారంగా కోర్టుకు వెళ్లాలని హైకోర్టులో తీర్పు ఉందని అసోసియేషన్ ప్రతినిధులు తెలిపారు. కార్యక్రమంలో సొసైటీ సభ్యులు, స్థానికులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ శేరిలింగంపల్లి అధ్యక్షుడిగా సంజీవరెడ్డి


నియామక పత్రం అందుకుంటున్న నల్లా సంజీవరెడ్డి

గచ్చిబౌలి, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ శేరిలింగంపల్లి నియోజకవర్గ అధ్యక్షుడిగా నల్ల సంజీవరెడ్డిని నియమిస్తూ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి నియామక ఉత్తర్వులు ఆదివారం అందజేశారు. ఈ మేరకు నియోజకవర్గ ఇన్‌చార్జి జగదీశ్వర్‌గౌడ్ సమక్షంలో సంజీవరెడ్డి నియామక పత్రం అందజేశారు. నంతరం సంజీవరెడ్డి మాట్లాడుతూ.. ప్రభుత్వ సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్, ఎమ్మెల్సీ మహేష్‌కుమార్‌గౌడ్, రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు నర్సింహారెడ్డి, జగదీశ్వర్‌గౌడ్‌కి కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ బలోపేతానికి కృషిచేస్తానన్నారు.

● 5కే రన్



మూసాపేటలోని రెయిన్‌బో విస్టా గేటెడ్ కమ్యూనిటీలో ఆదివారం 5కే, 3కే రన్, చిన్నారుల కోసం 2కే రన్ నిర్వహించారు. కార్యక్రమంలో కాలనీవాసులు పెద్దఎత్తున పాల్గొన్నారు. సైబర్‌సిటీ సంస్థ ప్రతినిధి వంశీకృష్ణారెడ్డి, కాలనీ అధ్యక్షుడు బండి మధుసూదన్‌రెడ్డి జెండా ఊపి రన్ ప్రారంభించారు. విజేతలకు బహుమతులు అందజేశారు.

- కూకట్‌పల్లి, ఆంధ్రజ్యోతి

● 3కే రన్



ప్రతి రోజూ ఉదయం వాకింగ్ చెయ్యడం వల్ల అనారోగ్యం ధరిచేరదని కార్పొరేటర్ శేషగిరి అన్నారు. డివిజన్ పరిధిలోని మిథులానగర్ కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం 3కే రన్ నిర్వహించారు. ఈ రన్‌లో కార్పొరేటర్, తదితరులు పాల్గొన్నారు.

- గాజులరామారం, ఆంధ్రజ్యోతి

మరోసారి నరేంద్రమోదీని గెలిపించాలి: ఈటల


సమావేశంలో మాట్లాడుతున్న ఈటల రాజేందర్

పేట్‌బషీరాబాద్, మార్చి 24(ఆంధ్రజ్యోతి): రానున్న ఎన్నికల్లో మరోసారి ప్రధాని నరేంద్రమోదీని గెలిపించాలని మల్కాజ్‌గిరి బీజేపీ పార్లమెంట్ అభ్యర్థి ఈటల రాజేందర్ ఓటర్లను అభ్యర్థించారు. ఆదివారం జీడిమెట్ల డివిజన్‌లోని శాంతారామ్ అపార్టుమెంట్స్‌లో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఈటల మాట్లాడుతూ.. పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీకి ఓటు వేసి గెలిపించాలని కోరారు. కేంద్రంలో నరేంద్రమోదీ చేస్తున్న అభివృద్ధిని చూసి యువత బీజేపీ వైపు ఆకర్షితులవుతున్నారని అన్నారు. అనంతరం అపార్టుమెంట్‌లో ఉన్న ఆలయంలో పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షుడు డాక్టర్ ఎస్ మల్లారెడ్డి, మేడ్చల్ అర్బన్ జిల్లా కార్యదర్శి భరత్ సింహారెడ్డి, నరేందర్‌రెడ్డి, సీనియర్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

బీజేపీతోనే అభివృద్ధి సాధ్యం

కూకట్‌పల్లి: పార్లమెంట్ ఎన్నికల్లో ఎన్‌డీఏ కూటమి 400లకు పైగా సీట్లు సాధించబోతుందని బీజేపీ మల్కాజ్‌గిరి పార్లమెంట్ అభ్యర్థి ఈటల రాజేందర్ అన్నారు. రాష్ట్రం పూర్తి అభివృద్ధి చెందాలంటే బీజేపీ అభ్యర్థులను గెలిపించుకోవాల్సిన అవసరముందని ఆయన పేర్కొన్నారు. కూకట్‌పల్లి నియోజకవర్గ ఇన్‌చార్జి మాధవరం కాంతారావు ఆధ్వర్యంలో ఫతేనగర్‌కు చెందిన బీఆర్ఎస్ నాయకులు భగవంత్‌రెడ్డితో పాటు ఆయన అనుచరులు ఆదివారం కూకట్‌పల్లిలో ఈటల సమక్షంలో బీజేపీలో చేరారు.

● కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాల గురించి ఇంటింటికీ తెలియజేసేలా కృషి చేయాలని మాధవరం కాంతారావు అన్నారు. కూకట్‌పల్లిలోని బీజేపీ కార్యాలయంలో బూత్‌స్థాయి కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. నాయినేని సూర్యప్రకాష్‌రావు, వడ్డేపల్లి రాజేశ్వరరావు, శ్రీకర్‌రావు, వినోద్‌కుమార్‌గౌడ్, సురేందర్, సోమశేఖర్, వినోద్, రాము, అనిల్, సంతోష్, పవన్, అర్జున్, సూరిబాబు, సత్యనారాయణ, జ్యోతి, లహరి పాల్గొన్నారు.

టీచర్లకు 'టెట్' టెన్షన్

(5వ పేజీ తరువాయి)

ఇందులో దాదాపు 25 శాతం మంది రిటైర్‌మెంట్‌కు దగ్గరలో ఉన్నారు.

ఎస్‌జీటీలకు టెట్-1 తప్పనిసరి..

స్కూల్ అసిస్టెంట్ ప్రమోషన్ కోసం ఎదురుచూస్తున్న సెకండరీ ఎడ్యుకేషన్ టీచర్(ఎస్‌జీటీ)లు తప్పనిసరిగా టెట్-1ను రాయాల్సిన పరిస్థితి నెలకొంది. ఇందులో అర్హత సాధిస్తేనే రానున్న రోజుల్లో వారికి ఎస్ఏ పదోన్నతి దక్కనుంది. అలాగే, ఇప్పటికే స్కూల్ అసిస్టెంట్ కేటగిరీలో ఉద్యోగం పొందిన వారు సైతం టెట్-2ను రాయాల్సి ఉంది. భవిష్యత్ లభించే హెచ్ఎం, గెజిటెడ్ హెచ్ఎం లాంటి పదోన్నతులకు కూడా టెట్-1 ప్రామాణికంగా తీసుకునే పరిస్థితి ఉండడంతో వారు కూడా ఇందులో పాస్ కావాల్సి ఉంది. కాగా, ఎన్‌సీటీఈ తాజా నిబంధనలతో ఎస్‌జీటీలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. 2010 నుంచి 2017 వరకు నిర్వహించిన టీచర్ రిక్రూట్‌మెంట్ టెస్ట్(టీఆర్‌టీ)లో ఉద్యోగం పొందిన ఉపాధ్యాయులు టెట్‌లో అర్హత సాధించేందుకు ప్రయత్నిస్తుండగా.. 1995 తర్వాత నుంచి ఉద్యోగంలో చేరిన వారు ఒత్తిడికి లోనవుతున్నారు. ఎందుకంటే వారందరూ దాదాపు రిటైర్‌మెంట్‌కు దగ్గరగా ఉండడంతో పరీక్షను ఎదుర్కోవడం కష్టం.

ఉపాధ్యాయుల పదోన్నతులపై గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఏళ్ల తరబడి ఊరిస్తూ వచ్చింది. చాలామంది ప్రమోషన్లు పొందకుండానే రిటైర్‌మెంట్ అయ్యారు. అసెంబ్లీ ఎన్నికలు సమీపించిన తరుణంలో గతేడాది సెప్టెంబర్, అక్టోబర్‌లో కొంతమందికి హడావుడిగా ప్రమోషన్లు కల్పించింది. తర్వాత షెడ్యూల్ రావడంతో ప్రక్రియకు బ్రేక్ పడింది. కాగా, అప్పుడు ఎస్‌జీటీలు స్కూల్ అసిస్టెంట్ కేడర్‌కు వెళ్లగా.. స్కూల్ అసిస్టెంట్లు.. హెచ్ఎంలుగా, గెజిటెడ్ హెచ్ఎంలుగా పదోన్నతులు పొందారు. అయితే, వారందరూ టెట్ నిబంధన లేకుండానే ప్రమోషన్ తీసుకున్నారని, ఇప్పుడు తమకు తప్పనిసరి చేయడం ఎంతవరకు న్యాయమని పలువురు ఎస్‌జీటీలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.


హోలీ వేడుకల్లో అపార్టుమెంట్‌వాసులు, రంగులు కొంటున్న యువతులు, చిన్నారులు

హోలీ సంబరాలు

ఫతేనగర్, మార్చి 24(ఆంధ్రజ్యోతి): శివారు ప్రాంతాలలో హోలీ సంబరాలు మొదలయ్యాయి. ఆదివారం సెలవు రోజు కావడంతో ఒక రోజు ముందే శివారు ప్రాంతాలకు చెందిన కార్మికులు ఉద్యోగులు తమ స్నేహితుల ఇళ్లకు వెళ్లి రంగులు చల్లుకుంటూ సంబరాలు జరుపుకున్నారు. హోలీ సందర్భంగా అపార్టుమెంట్లు, గ్రేటర్ కమ్యూనిటీ ప్రాంతాలలో డీజేలు పెట్టి ప్రత్యేక ఏర్పాటు చేసి హోలీ వేడుకలను సంతోషంగా చేసుకున్నారు. మార్కెట్‌లో హోలీ కోసం రంగులు చల్లే గొట్టాలు, రంగులు కొనుగోలు చేసేందుకు యువతీ యువకులు, చిన్నారులు ఎగబడ్డారు.


వివేకానందనగర్ డివిజన్ వేంకటేశ్వరనగర్‌లో, అమీర్‌పేటలో కాముని దహనం చేస్తున్న ప్రజలు



● జన్మదిన శుభాకాంక్షలు

కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు రఘునాథ్‌యాదవ్ జన్మదినం సందర్భంగా కుటుంబసభ్యులతో కలిసి సీఎం రేవంత్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా ఆదివారం కలిశారు. కార్యక్రమంలో రఘునాథ్‌యాదవ్ సతీమణి రాజేశ్వరి, కుమార్తె అశ్విక, కుమారుడు హితన్ష్ ఉన్నారు.

- గచ్చిబౌలి, ఆంధ్రజ్యోతి

సునీతా మహేందర్‌రెడ్డిని గెలిపించండి

బాలానగర్, మార్చి 24(ఆంధ్రజ్యోతి): మల్కాజిగిరి పార్లమెంట్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న తన తల్లి పట్నం సునీతామహేందర్‌రెడ్డిని మల్కాజిగిరి ప్రజలు అత్యధిక మెజారిటీతో గెలిపించాలని మహేందర్‌రెడ్డి కుమారుడు మల్కాజిగిరి ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. ఆదివారం ఉదయం కాంగ్రెస్ కూకట్‌పల్లి ఇన్‌చార్జి బండి రమేష్, కాంగ్రెస్ నాయకులకు బాలానగర్ కాంగ్రెస్ కార్యాలయంలో కలిసి ఎన్నికల ప్రచారంపై వారితో చర్చించారు. కార్యక్రమంలో వెంకటేశ్వర్‌రావు, లక్ష్మయ్య, అస్లాం పాల్గొన్నారు.

శుభాకాంక్షల వెల్లువ



కేపీహెచ్‌బీకాలనీ: మల్కాజిగిరి పార్లమెంట్ నియోజకవర్గం కాంగ్రెస్ అభ్యర్థి సునీతమహేందర్‌రెడ్డిని ఆదివారం ఆ పార్టీ కూకట్‌పల్లి నియోజకవర్గం సీనియర్ నాయకులు కొప్పిశెట్టి దినేష్‌కుమార్, ఘంటా శ్రీనివాస్‌గౌడ్ కలిసి పుష్పగుచ్ఛం ఇచ్చి అభినందనలు తెలిపారు. నియోజకవర్గ ఇన్‌చార్జి బండి రమేష్ నాయకత్వంలో పార్లమెంట్ ఎన్నికల్లో సునీతా మహేందర్‌రెడ్డి విజయానికి కృషి చేస్తామని తెలిపారు.

ప్రభుత్వ విప్ మహేందర్‌రెడ్డిని కలిసిన కాంగ్రెస్ నేతలు


మహేందర్‌రెడ్డిని సన్మానిస్తున్న కాంగ్రెస్ నాయకులు

బాలానగర్, మార్చి 24(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ విప్‌గా నియమితులైన పట్నం మహేందర్‌రెడ్డిని కూకట్‌పల్లి కాంగ్రెస్ నాయకులు ఆదివారం మర్యాదపూర్వకంగా కలిశారు. కాంగ్రెస్ నాయకుడు కర్క నాగరాజు ఆధ్వర్యంలో కర్క పెంటయ్య మహేందర్‌రెడ్డికి శాలువా కప్పి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. వెంకన్న, శేఖర్‌గౌడ్, సప్పిడి భాస్కర్ పాల్గొన్నారు.

చేవెళ్ల గడ్డపై కాంగ్రెస్ జెండా ఎగురవేస్తాం

మియాపూర్, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో చేవెళ్లగడ్డపై కాంగ్రెస్ జెండా ఎగురవేస్తామని శేరిలింగంపల్లి ఇన్‌చార్జి జగదీశ్వర్‌గౌడ్ ఆదివారం తెలిపారు. మియాపూర్‌లో ఆయన ఆధ్వర్యంలో నిర్వహించిన ఆత్మీయ సమావేశానికి చేవెళ్ల ఎంపీ, కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి రంజిత్‌రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా జగదీశ్వర్‌గౌడ్ మాట్లాడుతూ.. కాంగ్రెస్.. ప్రజల ప్రభుత్వమన్నారు. రంజిత్‌రెడ్డి మాట్లాడుతూ.. అందరం కలిసికట్టుగా పార్టీ విజయానికి కృషి చేసి ముఖ్యమంత్రికి కానుకగా ఇద్దామన్నారు. కార్యక్రమంలో హఫీజ్‌పేట కార్పొరేటర్ పూజిత, రంగారెడ్డిజిల్లా డీసీసీ అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి, సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

● బీజేపీ, బీఆర్ఎస్‌కు చెందిన పలువురు నాయకులు, కార్యకర్తలు కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. వారికి రంజిత్‌రెడ్డి, జగదీశ్వర్‌గౌడ్ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.


మాట్లాడుతున్న ఎంపీ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి రంజిత్‌రెడ్డి